# గుప్పెడు గాలి

నా భర్త ఎటువంటి బలహీనతలులేని మనిషని నేను అనను. నాకు తెలిసి కొన్ని ఉన్నాయి. అవంత పట్టించుకోవలసిన వేం కావు. కొన్ని విషయాల్లో మాది అన్యోన్యమయిన దాంపత్యమయినా అయన అందినట్టు అనిపించడు. నా మనసు పాడుచేసుకోవడం ఇష్టం లేక పట్టించుకోవడం మానేశాను.

అయితే,

ఆయన సెల్‌ఫోను కొన్న దగ్గరనుండి నాకు తలనొప్పి మొదలయింది. అది కొనకముందు ఆఫీసునుండి ఇంటికి రాగానే నేను తయారుచేసి అందించిన కాఫీ తీసుకుని మా ఇంటి బాల్కనీలో కూర్చుని ఆరోజు జరిగిన సంగతులు ముచ్చటించుకునేవాళ్ళం. సమయం తెలిసేది కాదు. ఉదయం నుండి అప్పటివరకు ఇంటిపనులు చేసి అలిసిపోయాన నాకు ఆయన మాటలు సేద చేకూర్చేవి. ఆయన మాటకారి. విసుగ్గా ఉన్న మనసును చాకచక్యంగా మార్చగలడు.

నాకు ఆయనలో నచ్చని విషయం పరాయి ఆడవాళ్ళంటే ఆసక్తి చూపడం. కొత్తా, పాత ఉండదు. త్వరగా పరిచయం చేసుకుని చాలాసేపు మాట్లాడుతుంటాడు. అడగకపోయినా, అంతవసరం లేకపోయినా ఏదో సహాయం చేస్తుంటాడు. నాకు అయిష్టంగా అనిపించినా ఎప్పుడూ బయట పడలేదు. ఎప్పటికప్పుడు సర్దుకుపోతుంటాను.

మా ఇంట్లో అన్ని సదుపాయాలున్న లేండ్‌లైన్ ఫోను ఉంది. దాన్ని ఉపయోగించడం నాకు బాగా తెలుసు. సెల్‌ఫోనయితే మాటలు వినడం, మాట్లాడడం, చార్జి చేయడం తప్ప మిగతా విషయాల్లో దాన్ని ఎలా ఉపయోగిస్తారో నాకు తెలియదు. ఆయన నాలుగయిదుసార్లు ఎలా ఉపయోగించాలో వివరించాడు.

ఆయన చెబుతున్నంతసేపూ అర్థం అయినట్లే ఉంటుంది. ప్రయత్నం చేశాను కాని నా వల్ల కాలేదు. మా పిల్లలు మటుకు దాన్ని ఉపయోగించడం అవలీలగా నేర్చుకున్నారు. నేనింకా తంటాలు పడుతున్నాను.

తనకు ఇష్టం లేని వాళ్ల నుండి కాల్ వస్తే, నెంబరు చూసి తను ఇంట్లో లేడని నాచేత అబద్ధం చెప్పిస్తాడు. ఇష్టమయిన వాళ్ల నుంచి వస్తే బాల్కనీలో ఒక మూలగా కుర్చీ వేసుకుని చాలాసేపు మాట్లాడతాడు. మాట్లాడేది ఆడవాళ్ళతోనో, మగవాళ్ళతోనో నాకు అర్థం అయ్యేది కాదు. ఆఫీసు విషయాల్లా నాకు అనిపించేవి కావు. ఎవరితో మాట్లాడుతున్నావని ఎప్పుడూ అడగలేదు. అడగకుండా చెబుతాడని అనుకున్నాను. ఎప్పుడూ చెప్పలేదు.

మా పెళ్ళి అయి పది సంవత్సరాలు గడిచాయి. మా మధ్య అవగాహన లేదని కాదు. అప్పుడప్పుడు పోట్లాడుకున్నా సర్దుకుపోతుంటాం. దరిమిలా ఆయన నాకు దూరమవుతున్నట్టు అనిపిస్తోంది. మునుపటిలా నాతో ఎక్కువ సమయం గడపడం లేదు. ఇంటికి ఆలస్యంగా రావడం మొదలెట్టాడు. మెల్లగా ఇబ్బందులు మొదలయ్యాయి.

సామాన్యంగా నా సమస్యలు మరీ ముఖ్యంగా కుటుంబ సమస్యలు నేనే పరిష్కరించుకుంటుంటాను. అమ్మకు గాని నాన్నకు గాని, ఎంత దగ్గర వాళ్ళతోనయినా చెప్పను. ఆయన్నడిగితే నిజం బయటకు వస్తుందని అనిపించడం లేదు. దాని గురించే ఎక్కువ ఆలోచించడం వలన బాధ పేరుకోవడం మొదలైంది.

ఒకరోజు ఆయన చొక్కా ఉతకడానికి వేయబోతూ జేబులో ఏమీ లేవు కదా అని పరీక్షగా చూస్తే మడతలు పెట్టిన చిన్న కాయితం కనిపించింది. ఎవరిదో తెలియదు. పేరేమీ లేదు,. అది సెల్ నెంబరు కాదు. అది లేండ్‌లైన్ నెంబరు. ఆ నెంబరు ఎవరి పేరున ఉందో తెలుసుకోవడం కష్టమేమీ కాదు. ఎంక్వయిరీకి ఫోనుచేసి, ఆ నెంబరు ఎవరి పేరున ఉందో, చిరునామా చెప్పగలరా అని అడిగాను.

"రెండు నిమిషాలు ఆగండి, చెప్తాను" అంది.

నిమిషం కాకముందే అడిగింది. "మీరు చెప్పిన నెంబరు సరయినదే కదా?"

"సరయినదేనండీ" అని మళ్ళీ ఆ నెంబరు చెప్పాను.

"నెంబరు ఉంది కాని అది ఎవరి పేరున ఉందో, చిరునామా ఏదీ నమోదు

కాలేదు."

"అదెలా?"

"అత్యవసరంగా కనక్షన్ తీసుకోడానికి, మరికొన్ని సమయాల్లో నమోదు చేయడం మర్చిపోతుంటారు. కొన్నిసార్లు ఆలస్యం అవుతుంటుంది"

"తెలుసుకోడానికి వేరే దారిలేదా?"

"మా ఎగ్జిక్యూటివ్‌ను కనుక్కుని చెప్తాను" లయిన్లో ఉండండి."

అరనిమిషం తర్వాత ఆమే అంది, "అడిగాను. ఆయనకూ తెలియదట..."నేనేదో అడగబోతోంటే ఫోను పెట్టేసింది. నిరుత్సాహ పడ్డాను. నా మొదటి ప్రయత్నం విఫలమయింది.

కొద్దిసేపయ్యాక సరాసరి ఆ నెంబరుకే ఫోను చేస్తేనో అనిపించింది. 'మీరెవరు, ఎవరు కావాలి, ఎందుకు?' లాంటి ప్రశ్నలు ఎదురయితే జవాబులు కోసం వెతుక్కోవాలి. అబద్ధాలు ఆడొచ్చు. వెంటనే తట్టాలి. వాళ్ళకు కాలర్ ఐ.డి. ఉంటే కొత్త సమస్య మొదలవుతుంది.

ఏది ఏమయితే అయిందని కాయితం మీదున్న నెంబరుకు ఫోను చేశాను. ఎంగేజ్డ్. అయిదు నిమిషాలాగి మళ్ళీ చేశాను. ఎంగేజ్డ్. అరగంటాగి చేశాను. ఎంగేజ్డ్. ఎవరో ఆ మహాతల్లి మా ఆయనతో మాట్లాడుతుందా? నాకు దుఃఖం వస్తోంది. ఆటో ఇటో తేల్చుకుందామని పట్టుదల ఎక్కువ అవుతోంది. ఆయన సెల్‌నెంబరుకు ఫోను చేశాను. ఎంగేజ్డ్. తట్టుకోవడం కష్టమయింది, ఏడ్చేశాను.

సాయంత్రం ఆయన ఆఫీసునుండి వచ్చీరాగానే, కాయితం చూపించి, "ఈ ఫోను నెంబరు ఎవరిది?" నెమ్మదిగా అడిగాను.

నవ్వి, "ఈ కాయితం ఎక్కడ దొరికింది." అడిగాడు.

"మీ జేబులో".

"నా జేబులు వెదకడం ఎప్పటినుండి మొదలెట్టావు?" అని మళ్ళీ నవ్వాడు.

నా మాటలు నవ్వులాటగానే ఉన్నాయనుకుంటాను. నా చేయి అందుకుని తన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు.

"చొక్కా ఉతకడానికి వేయబోతూ చూస్తే దొరికింది. ఈ నెంబరు ఎవరిదో తెలుసుకుందామని చాలాసార్లు ప్రయత్నం చేశాను. ఎంగేజ్డ్ వచ్చింది."

"మనింటి ఫోను నెంబరు మనమే చేస్తే ఎంగేజ్డ్ కాక మరేం వస్తుంది? చాలామందికి బయటివాళ్ల ఫోను నెంబర్లు సెల్ నెంబర్లు గుర్తుంటాయి కాని మన నెంబర్లు మనకు వెంటనే గుర్తురావు." అన్నాడు.

గుండెమీంచి బరువు తీసేసినట్టు నా మనసు తేలికయింది. ఉదయం నుండి మథన పడినందుకు నొచ్చుకున్నాను.

అయితే,

నా సమస్య సమస్యగానే ఉండిపోయింది.

సెల్‌లో అంతసేపు ఎవరితో మ్కాట్లాడుతూ ఉంటాడు?

❖ ఆదివారం వార్త, 20 ఏప్రిల్, 2008